క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 28న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఎన్జీవోస్ కాలనీ, వెంకటేశ్వర టెంపుల్, సంఘమిత్ర కాలనీ, శ్రీలక్ష్మి నగర్, వాటర్ ట్యాంక్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కన్స్యూమర్ రైట్స్ కమిషన్ జిల్లా చైర్ పర్సన్‌గా నూకల రాణి



వరంగల్: నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ వరంగల్ జిల్లా చైర్ పర్సన్‌గా నూకల రాణి నియమితులయ్యారు. హైదరాబాద్ శిల్పారామంలో నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఫౌండర్ చైర్మన్ ఎంవీఎల్.నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని సోమవారం స్వీకరించారు.

మధుకు ఎంఫిల్ డిగ్రీ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకుడు తౌటం మధుకు యూనివర్సిటీ ఎంఫిల్ డిగ్రీ ప్రదానం చేసింది. వర్క్ కల్చర్ ఇన్ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కొత్తగూడెం అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి మధుకు ఎంఫిల్ డిగ్రీ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ రామేశ్వరం పర్యవేక్షణలో మధు తన ఎంఫిల్ డిగ్రీ పొందారు.

వృద్ధులకు సన్మానం



హన్మకొండ అర్బన్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అవోపా హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంఘంలో 76 ఏళ్ల పైబడిన పలువురు సభ్యులకు నగరంలోని అవోపా భవన్‌లో సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా టీజీఎన్పీడీసీఎల్ జనరల్ మేనేజర్ గందె మల్లికార్జున్, ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజనీర్ చింత మహేష్ పాల్గొని వారిని సన్మానించారు. కార్యక్రమంలో అవోపా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లాల సత్యనారాయణ, ఇమ్మడి పుల్లయ్య, బాధ్యులు శ్రీనివాస్, సదానందం, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహాగర్జనను విజయవంతం చేయాలి



కాజీపేట: బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఫిబ్రవరి 2న ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరగనున్న మహాగర్జన మహాసభను విజయవంతం చేయాలని తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్ కోరారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గీత కార్మికులు మోకు, ముత్తాదులతో బీసీ గర్జనకు తరలివచ్చి తమ ఐక్యతను చాటాలని విజ్ఞప్తి చేశారు. కల్లు గీత కార్మికం సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్, జనగాని శ్రీనివాస్, బొల్లికొండ యాదగిరి, మోడెం రాజేందర్, సదానందం, కమ్మగాని భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



ఎంజీఎం: కిట్స్ కళాశాల అంబాల సమీపంలో సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు, టాటా ఏసీ ఢీకొన్న ఘటనలో గాయపడి ఎంజీఎంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మెరుగైన వైద్యం అందించాలని ఆర్ఎంఓ, వైద్యులకు సూచించారు.

కబ్జాదారుడిపై చర్య తీసుకోవాలి

వరంగల్: వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లి శివారులోని 1242/43లో ఏర్పాటు చేసిన లోటస్ లైట్స్‌లో 2వేల గజాలను పార్కు కోసం కేటాయించిన భూమిని కబ్జా చేసిన పిన్నింటి ప్రకాశ్‌రావు చర్యలు తీసుకుని పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు ప్రజావాణిలో వరంగల్ కలెక్టర్ సత్య శారదకు సోమవారం సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ భూమిని పోలం జగన్నాథరెడ్డి వద్ద ఆర్‌టీసీ సొసైటీ కొనుగోలు చేసి 1980లో కాలనీ ఏర్పాటు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- కూలేందుకు సిద్ధంగా ఉన్న కడిపికొండ గ్రామ పంచాయతీ ప్రహరీ
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



ధ్వంసమైన కడిపికొండ పంచాయతీ ప్రహరీ భయాందోళనలో ప్రజలు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలంలోని కడిపికొండ గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రహరీ ధ్వంసం అయింది. ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి నెలకొంది. కడిపికొండ జీపీ దారిలో రాంపేట, కుమ్మరిగూడెం, తరాలపల్లి గ్రామాలతో పాటు స్థానికంగా ఉన్న పాఠశాలలకు ఆయా గ్రామస్తులు, విద్యార్థులు నిత్యం ప్రయాణిస్తుంటారు. ఈక్రమంలో గోడ కూలితే జరిగితే ప్రాణాలకే ప్రమాదం. కడిపికొండ గ్రామ పంచాయతీ కార్యాలయానికి రోజూ ఏదోఒక పని నిమిత్తం మున్సిపల్, రెవెన్యూ అధికారులు, కార్మికులు వస్తుంటారు. కూలేలా ఉన్న ఈ ప్రహరీ మాత్రం వారికి కానరావడం లేదు. అది ఎప్పుడు కూలుతుందో అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ధ్వంసమైన ప్రహరీ నుంచే రాకపోకలు సాగిస్తుంటారని వాపోతున్నారు. ఈక్రమంలో అధికారులు దృష్టి సారించి ప్రహరీని కూల్చి తిరిగి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన ప్రహరీ నిర్మించాలి



ఎప్పుడు కూలుతుందో తెలియని గ్రామ పంచాయతీ ప్రహరీని తక్షణమే తొలగించాలి. దాని స్థానంలో నూతన ప్రహరీని నిర్మించాలి. గ్రామ పంచాయతీ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం రోజూ వందలాది మంది వస్తూ పోతుంటారు. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– బస్కే రాజేందర్, కడిపికొండ

డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు రద్దు చేస్తే ఊరుకోం



సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్

నయీంనగర్: గత ప్రభుత్వంలో రాష్ట్రంలో డెస్క్ జర్నలిస్టులను గుర్తించి అక్రిడిటేషన్లను అల్లం నారాయణ ఇప్పిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కోత పెట్టేందుకు సిద్ధమైందని, అలా జరిగితే పోరాటాలకు సిద్ధమని టీయూడబ్ల్యూజే (హెచ్–143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్.లెనిన్ హెచ్చరించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం జరిగిన హనుమకొండ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 10 ఏళ్లుగా టీయూడబ్ల్యూజే (హెచ్– 143) సంఘం జర్నలిస్టులను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటోందని వివరించారు. రాష్ట్ర కార్యదర్శి తడక రాజ్‌నారాయణ మాట్లాడుతూ కరోనా లాంటి విపత్కర పరిస్థితిల్లో ఆర్థిక సహాయం అందించి జర్నలిస్టులకు మనోధైర్యాన్ని నింపిన ఘనత యూనియన్‌కే దక్కుతుందన్నారు. సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి అర్షం రాజ్‌కుమార్, కోశాధికారి పాగాకుల ప్రభాకర్ గౌడ్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు బూరం ప్రశాంత్, కార్యదర్శి వేణు గోపాల్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం విజేతలకు అభినందన



మామునూరు: ఇటీవల జరిగిన జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో మామునూరు టీజీఎస్పీ నాలుగో బెటాలిన్ పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పోటీల్లో 102మంది విద్యార్థులు పాల్గొనగా 10 మంది గోల్డ్‌మెడల్, ఎనిమిది మంది సిల్వర్, నలుగురు కాంస్య పతకాలు సాధించారు. ఈ మేరకు సోమవారం వారిని పాఠశాల ప్రాంగణంలో హెచ్‌ఎం గోవిందరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శాంతకుమారి అభినందించారు.

అనాథ పిల్లలకు పండ్లు, స్వీట్ల పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న శ్యామ్, తదితరులు

విద్యారణ్యపురి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడం గొప్ప విషయం అని మంద కొమురయ్య, కొమరమ్మ సేవాసమితి వ్యవస్థాపకుడు, కాకతీయ యూనివర్సిటీ ఉద్యోగి మంద శ్యామ్ అన్నారు. ఈమేరకు హంటర్‌రోడ్డులోని న్యూశాయంపేట రోడ్డులోని రైల్వే గేట్ ప్రాంతంలోని హోప్ అనాథ ఆశ్రమంలో సోమవారం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంద కృష్ణమాదిగ సోదరుడు మంద ఇద్దయ్య, మంద కొమురయ్య, కొమరమ్మ సేవాసమితి ప్రతినిధులు పిండి కుమార్‌యాదవ్, మంద సికిందర్, గడ్డం ప్రసాద్, జన్ను నిరంజన్, జంగం సునీల్, మంద శ్రేయాస్, హోప్ అనాథ ఆశ్రమ నిర్వాహకులు లూథర్ ప్రసన్న, రాజ్‌కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్‌లో విద్యార్థి ప్రతిభ



ఖిలా వరంగల్: హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో సోమవారం జరిగిన కాకతీయ యూనివర్సిటీ స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో వరంగల్ ఆర్‌టీఏ జంక్షన్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి రాజ్యలక్ష్మి ప్రతిభ కనబరిచింది. ఈమేరకు ఆల్‌ఇండియా యూనివర్సిటీ పోటీలకు ఎంపికైంది. ఆమెను కళాశాల ప్రాంగణంలో కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, వైస్ ప్రిన్సిపాల్ మమత, ఫిజికల్ డైరెక్టర్ పద్మ అభినందించారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం

- బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్



డైరీ ఆవిష్కరిస్తున్న యూనియన్ బాధ్యులు

కేయూ క్యాంపస్: కార్మికుల హక్కులకోసం పోరాడేది తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ – 445, భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) (అనుబంధం) రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం సెనెట్‌హాల్‌లో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె శశికుమార్ అధ్యక్షతన యూనియన్ రూపొందించిన నూతన సంవత్సరం డైరీని ఈపీఎఫ్ రీజినల్ కమిషనర్ తానయ్య ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె శశికుమార్ మాట్లాడుతూ ఆర్టిజన్లకు కన్వర్షన్ ఇచ్చి వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర సంఘటన మంత్రి రామ్మోహన్‌జీ, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ వేణు గోపాల్, అధ్యక్షుడు గొర్ల రవీందర్, బాధ్యులు రావుల రమణారెడ్డి, గాజె మహేందర్, ఎస్పీడీసీఎల్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్లు వరద రాజులు, రవికుమార్, నర్సింహులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను విమర్శించే అర్హత కడియం శ్రీహరికి లేదు

హన్మకొండ: కేంద్రమంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్‌ను విమర్శించే అర్హత ఎమ్మెల్యే కడియం శ్రీహరికి లేదని బీజేపీ ఎస్సీ మోర్చా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి పూర్ణాచారి పేర్కొన్నారు. కడియం శ్రీహరి వ్యాఖ్యలను వారు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరే కడియం.. కేంద్ర మంత్రులను విమర్శించడం నీతిమాలిన చర్యగా అభివర్ణించారు. ఊసరవెల్లిలా పూటకో మాట మార్చే తత్వం శ్రీహరిది అని పేర్కొన్నారు.

తల్లిదండ్రులు గర్వపడే స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

- సీబీఐ రిటైర్డ్ జేడీ లక్ష్మీనారాయణ

హసన్‌పర్తి: విద్యార్థులు తమ తల్లిదండ్రులు గర్వపడేస్థాయికి ఎదగాలని సీబీఐ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ సూచించారు. హసన్‌పర్తి మండలం పెంబర్తి క్రాస్‌లోని ఏకశిల పాఠశాలలో వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తాను చదువుకున్న పాఠశాలకు ముఖ్యఅతిథిగా రావాలని, తన సంతకం ఆటోగ్రాఫ్‌గా మారాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. సంస్కారంతో కూడిన విద్య అభ్యసించినప్పుడే ఉన్నతస్థాయికి ఎదుగుతారని చెప్పారు. ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలు వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్లు గౌరు రాజిరెడ్డి, బేతి కొండల్‌రెడ్డి, గౌరు సువిజారెడ్డి, జితేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు దినేష్‌రెడ్డి, శైలజారెడ్డి, ముచ్చ స్వప్నారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం



హన్మకొండ చౌరస్తా: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వాకర్స్ ఇంటర్నేషనల్ 303, ఎంజీఎఫ్, పబ్లిక్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఉదయం 6 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించిన వైద్య శిబిరంలో తన్వి నేచురోపతి క్లినిక్ వ్యవస్థాపకుడు థెరపిస్ట్ డాక్టర్ అన్వేష్ కందగట్ల పరీక్షలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు హెచ్‌ఆర్ అనిల్‌కుమార్, థెరపిస్టులు రబ్బానీ, దుర్గాప్రసాద్, సుమలత, జగదీశ్వరి, ప్రభాకర్, సీతామహాలక్ష్మి, ఉమాపతి, అనూష తదితరులు పాల్గొన్నారు.

'సూర్య మోటార్స్' ఎలక్ట్రికల్ బైక్స్ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న సీఎండీ ఉషారాణి

రామన్నపేట: నగరంలోని సంతోషిమాత కాలనీలోని శ్రీరాముల సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూర్య మోటార్స్ ఎలక్ట్రికల్ బైక్స్ అండ్ మోటర్స్ షోరూంను బీబీఎం ఎలక్ట్రికల్ బైక్స్ సంస్థ సీఎండీ ఉషారాణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలుష్య నివారణ కోసం ఎలక్ట్రికల్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. ఈక్రమంలో హైదరాబాద్‌లో బీబీఎం ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి సామాన్యులకు అందుబాటు ధరలో వాహనాలు తయారుచేసి అందిస్తున్నట్లు వివరించారు. వరంగల్‌లో సూర్య మోటార్స్ షోరూం ఏర్పాటుతో రాష్ట్రంలో బీబీఎం సంస్థ ఎలక్ట్రికల్ బైక్‌ల షోరూంల సంఖ్య 13కు చేరిందని అన్నారు. సూర్య మోటార్స్ ఎండీ శ్రీరాముల సురేష్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుదాం – పెట్రోల్ ఖర్చును వదిలేద్దాం అనే నినాదంతో బీబీఎం ఎలక్ట్రికల్ వాహనాల ద్వారా కాలుష్య నివారణ తగ్గించాలనే లక్ష్యంతో వరంగల్‌లో ఈ షోరూం నెలకొల్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో శంకర్, రామారావు, గందె కల్పన, విజయలక్ష్మి, శ్రీరాముల సునీత నరేష్, రమేష్, సుధాకర్, రాజు, సతీష్, యాకోబు, శ్రీనివాస్, కుమారస్వామి, రూపేష్, కన్నా, సలీం, రవి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఎలక్ట్రికల్ డే

కాజీపేట రూరల్: కాజీపేట ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాజీపేట బాపూజీనగర్ చౌరస్తాలో ప్రపంచ ఎలక్ట్రికల్ డేను సోమవారం నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మైసారపు సిరిల్‌లారెన్స్, అసోసియేషన్ నాయకులు జాక్సన్, భాస్కర్, కుమారస్వామి, బైరి శేషాద్రి, సురేష్, రఫీ, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడికి ప్రశంస

కాశిబుగ్గ సెంటర్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డికి కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం ప్రశంస పత్రం అందజేశారు. ఆదివారం గణతంత్ర దినోత్సవానికి మల్లారెడ్డి హాజరు కాకపోవడంతో ప్రజావాణి ముగిసిన అనంతరం మల్లారెడ్డిని కలెక్టర్ పిలిపించి అందజేశారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్, తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో 300 నేత్రదానాలు, 130 శరీరదానాలు చేసినందుకు ప్రశంస పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి బి.రాజమౌళి, ఏ.రాజేంద్ర ప్రసాద్, సత్యనారాయణ, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ ఎం.విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఖిలా వరంగల్: ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతీఒక్కరి బాధ్యత అని వరంగల్ మట్టెవాడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ సూచించారు. ఈ మేరకు వరంగల్ ఫోర్ట్‌రోడ్ షైన్ హైస్కూల్ ప్రాంగణంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు అజయ్, ఆసిస్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

- వరంగల్ కలెక్టర్ సత్యశారద



సమీక్షలో కలెక్టర్ సత్యశారద, పక్కన అధికారులు

కాశిబుగ్గ సెంటర్: ఫిబ్రవరి 3 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ ప్రయోగ (ప్రాక్టికల్స్) పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఇంటర్ విద్య బోర్డు అధికారుల ఆదేశాలను పాటించాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఇంటర్ ప్రాక్టికల్స్, పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు జిల్లా రిపోర్ట్‌ను ఇన్‌చార్జ్ డీఐఈఓ మాధవరావు వివరించారు. ఫిబ్రవరి 3 నుంచి జిల్లాలో ఇంటర్ ప్రయోగ పరీక్షలు ప్రారంభించనున్నట్లు, నాలుగు విడతల్లో జరిగే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1,496 మంది ప్రథమ సంవత్సరం, 3,484 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రయోగ పరీక్షలకు హాజరు కానున్నట్లు వెల్లడించారు. ఈసారి ప్రయోగశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేసి ఇంటర్ బోర్డు నుంచి పర్యవేక్షించడానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రెవెన్యూ, విద్యుత్, ఆర్టీసీ, విద్య, వైద్యశాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూజీసీ ముసాయిదాను ఉపసంహరించుకోవాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బాధ్యులు

కేయూ క్యాంపస్: యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తూ తీసుకొచ్చిన యూజీసీ నూతన మార్గదర్శకాల ముసాయిదాను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద ప్రధాని మోదీ దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ యూనివర్సిటీల్లో సంఘ్ పరివార్ శక్తులను చొప్పించేందుకు యూజీసీ కొత్త మార్గదర్శకాలను తీసుకొచ్చిందని ఆరోపించారు. యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, కె.కుమార్, సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, జిల్లా సమితి బాధ్యులు శ్రీపతి వినయ్, కేయూ బాధ్యులు వినయ్, సాయి, రాజ్‌కుమార్, నవీన్, అనిల్, రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

సీపీఐ సభను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

మడికొండ: వందేళ్ల భారత కమ్యూనిస్టు పార్టీ ప్రారంభ ఉత్సవాల కరపత్రాలను కాజీపేట మండలం రాంపూర్‌లోని హనుమంతరావు స్తూపం వద్ద పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యోద్యమంలో, సమసమాజ స్థాపన కోసం 1925, డిసెంబర్ 26న పార్టీ ఆవిర్భవించిందని గుర్తుచేశారు. మీరట్, కాన్పూర్, పెషావర్, లాహోర్ కుట్ర కేసులను కమ్యూనిస్టు నాయకులు ఎదుర్కొని అండమాన్ జైలు జీవితం గడిపారని గుర్తుచేశారు. మొక్కవోని ధైర్యంతో స్వాతంత్ర్యం కోసం ముందుండి పోరాటాలు చేశారని తెలిపారు. ఈనెల 29న వేలాది మందితో హనుమకొండలో భారీ ప్రదర్శన అనంతరం హరిత హోటల్‌లో సభ నిర్వహించనున్నట్లు వివరించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, మాలోతు శంకర్ నాయక్, బొట్టు భిక్షపతి, మల్లయ్య, ఐలయ్య, ఉపేందర్, రాజయ్య పాల్గొన్నారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

కేయూ క్యాంపస్: నేతాజీ సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానంద లాంటి మహనీయులను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు కోరారు. కాకతీయ యూనివర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఖేల్ భారత్ క్రీడోత్సవం ప్రారంభం సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో వస్తున్న నూతన టెక్నాలజీని అందిపుచ్చుకొని కష్టపడి చదువుకోవాలని సూచించారు. ఈక్రమంలో సెల్‌ఫోన్ చోడో.. మైదానం చలో అనే నినాదంతో విద్యార్థును మైదానం బాట పట్టించి, నిషా విముక్త్ భారత్ పట్టించడమే ఏబీవీపీ ప్రధాన లక్ష్యం అని అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ కేయూ ఇన్‌చార్జ్ నిమ్మల రాజేష్, అధ్యక్షుడు సాయికుమార్, బాధ్యులు గట్టు ప్రశాంత్, అంబాల కిరణ్, చెట్ల సతీష్, సంయుక్త, పూజ, ఎలేంద్ర, సాయిశ్రీ, అభి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు



రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు

మడికొండ: మాస శివరాత్రిని పురస్కరించుకొని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యాగశాలలో గణపతి హోమం, రుద్ర హోమం నిర్వహించారు. సోమవారం మాస శివరాత్రి కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ, మణిశర్మ, ధర్మకర్తలు బైరి రాజుగౌడ్, రొడ్డ దయాకర్, వస్కుల ఉమ, జ్ఞానేశ్వరి, దండిగం శ్రీనివాస్, బోగి కేదారి, భక్తులు సురేష్, భిక్షపతి, వెంకన్న, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసా రూ.12.83 కోట్లు

ఖిలా వరంగల్: రైతన్నలకు రైతు భరోసాకు వేళాయ్యింది.. సాగుకు యోగ్యమైన భూములకు సాయం అందించాలని మంత్రి మండలి తీసుకున్న నిర్ణయం మేరకు జనవరి 26 నుంచి పక్కాగా సాయం అందించాలని ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సోమవారం ఉదయం నుంచి వరంగల్ జిల్లాలో ఎంపిక చేసిన రైతన్నల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమవుతోంది. సర్వే ద్వారా యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో 11 గ్రామాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. 11,836 మంది రైతులకు రూ.12.83 కోట్లు పెట్టుబడి సాయం వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతున్నాయి. అందులో వ్యవసాయేతర భూములతోపాటు నివాస స్థలాలకు పరిగణనలోకి తీసుకోలేదు. రైతుల ఖాతాల్లో సోమవారం ఉదయం నుంచే డబ్బులు పడుతున్నాయి. యోగ్యమైన భూముల రైతు భరోసా వర్తింపజేసింది. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను ఇటీవలనే ప్రభుత్వం విడుదల చేసి పక్కాగా అమల్లోకి తెచ్చింది.

గ్రామ సభల్లో వివరాలు..

గ్రామ సభల్లో రైతు భరోసా లబ్ధిదారులు, సాగు భూములు వివరాలు వెల్లడించారు. దానిలో జిల్లాలో ప్రస్తుతం 1,57,207 మంది సాగు రైతులు ఉన్నారు. ఇటీవల నూతనంగా పట్టా పాస్ బుక్కులు పొందిన రైతులు 6,624 మంది కాగా, మొత్తం 16,3831 మంది రైతులు పెట్టుబడి సాయం అందుకోనున్నారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం ఎంపిక చేసిన రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది.